ముమ్మరంగా పిల్లల సర్వే

- ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి విద్యాశాఖ అధికారులు
- నెల రోజుల పాటు ప్రక్రియ
- ఎప్పటికప్పుడు ప్రబంధ్ పోర్టల్‌లో వివరాల నమోదు



భద్రాచలంలో సర్వే చేస్తున్న విద్యాశాఖ ఉద్యోగులు(ఫైల్)

భద్రాచలంటౌన్: బాలబాలికలు చదువుకు దూరంగా కాకుండా బడీడు పిల్లలు ప్రతి ఒక్కరు చదువుకోవాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలో విద్యకు దూరంగా ఉండే పిల్లలను గుర్తించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు బడి బయట పిల్లల గుర్తింపు పేరుతో సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా విద్యాశాఖ అధికారులు భద్రాచలం డివిజన్‌లో బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను ఈ నెల 11 నుంచి ప్రారంభించారు. బడీడు పిల్లలు చదువు మానేసిన వాళ్లు, కొంత కాలం పాఠశాలకు వెళ్లి తరువాత రాకుండా ఉండే విద్యార్థులను గుర్తించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రబంధ్ పోర్టల్ పేరుతో ఒక యాప్‌ను రూపొందిచారు. ప్రతి రోజు చేసిన సర్వే వివరాలను ఈ యాప్‌లో పొందుపరుస్తారు.

నెల రోజులు సర్వే

విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వం బడి బయట పిల్లలను గుర్తించే సర్వే ప్రతి ఏడాది జనవరిలో చేపట్టనుండగా ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా డిసెంబర్ 11 నుంచి జనవరి 10 వరకు సర్వే చేసే విధంగా విద్యా శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పాఠశాల స్థాయిలో 6 సంవత్సరాల నుంచి 14 వరకు, కళాశాల స్థాయిలో 15 నుంచి 19 సంవత్సరాల వయసున్న బాలబాలికలను గుర్తించే విధంగా సర్వే నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ పరిధిలో సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలు వారికి కేటాయించిన పరిధిలో క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తారు. భద్రాచలం డివిజన్‌లోని భద్రాచలం పట్టణం, దుమ్ముగూడెం, చర్ల మండలాల పరిధిలో విద్యాశాఖ అధికారులు ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. అలాగే, సంచార జాతులకు చెందిన కుటుంబాలను కలిసి వారి పిల్లల చదువుల వివరాలను సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రతి రోజు సర్వే చేసి బడి బయట విద్యార్థుల వివరాలను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, ఇప్పటివరకు సర్వేలో గుర్తించిన బడి బయట పిల్లల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడంతో ఎంత మందిని గుర్తించారో వివరాలను వెల్లడిచలేమని విద్యాశాఖ అధికారులు తెలుపుతున్నారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలనేదే లక్ష్యం

ఏటా బడి బయట పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నాం. బడీడు పిల్లలతో పాటు చదువు మానేసిన పిల్లలను గుర్తించనున్నాం. ప్రతీ విద్యార్థి చదువుకోవాలనేది ప్రభుత్వ లక్ష్యం. సర్వేలో గుర్తించిన పిల్లల వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో సిబ్బంది నమోదు చేస్తున్నారు.

–సున్నం సమ్మయ్య, ఎంఈఓ, భద్రాచలం

క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జాను నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశాలు పొందగోరు విద్యార్థులు tgcet.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.100ల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18వ నుంచి 2024 జనవరి 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు 2024 ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష జరుగునని, కావున సకాలంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

26 నుంచి రామసేవిత అక్షింతలు పంపిణీ

అశ్వాపురం: జనవరి 22న అయోధ్యలో జరిగే సీతారామచంద్రస్వామి వారి ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా ఈ నెల 26 నుంచి అయోధ్య నుండి వచ్చిన అక్షింతలను మండలంలో ప్రతీ గ్రామానికి పంపిణీ చేయనున్నట్టు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మండల సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రామాలయంలో అక్షింతలు పంపిణీ కార్యక్రమ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 1 నుండి ప్రతీ ఇంటికి అక్షింతలు పంపిణీ చేసేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, రామ భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మణుగూరు రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన చిట్టిపల్లి నాగేశ్వరరావు గొంతులో కణితితో బాధపడుతుండగా అతని వైద్య ఖర్చుల నిమిత్తం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రూ.4వేలు ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గాజుల పూర్ణచందర్‌రావు, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ కృష్ణమోహన్, భాగం రమేష్, నాగేశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని అన్నదైవం పాఠశాలకు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని అందజేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సంస్థ అధికారులు పాఠశాల ఉపాధ్యాయులకు సామగ్రిని అందజేశారు. సర్పంచ్ బోడా పద్మ, టీఎస్ఎఫ్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్ వేంకటేశ్వరావు, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ జ్యోతి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డ్ ఏర్పాటుచేయాలి

మణుగూరు రూరల్ : హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు డిమాండ్‌చేశారు. గురువారం మణుగూరు పట్టణంలో హమాలీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హమాలీ కార్మికుల సమస్యలపై గత ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించాయన్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైన హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీను, సుధాకర్, రమేష్, సాంబయ్య, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



మాట్లాడుతున్న జాన్

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న పలువురు రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు గురువారం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. వీరికి ఆయన యూనియన్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణిలో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, సమాన పనికి సమాన వేతనం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో కార్మికులు సంఘాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.రాజలింగు, నాగరాజు, కె రవికుమార్, రాజబిల్లి, వేణుగోపాల్, వినయ్, సమ్మయ్య, సాంబశివరావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న జీఎం కృష్ణయ్య

మణుగూరు రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్‌ఓటు జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని సింగరేణి ఆధ్వర్యంలో పీవీకాలనీ సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు, సేవా సభ్యులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జీఎం ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల్లో ప్రతిభను వెలికి తీసేందుకు, వారు స్వయం ఉపాధి పొందేందుకు సింగరేణి వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇవ్వడమే కాకుండా వారిని ప్రోత్సహించేందుకు పలు రకాల పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీఓలు సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, నరేష్, సేవ కార్యదర్శి షకీర, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, రామ్‌లాల్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాల్వ గండ్లు పూడ్చివేత



గండి పూడ్చిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మిచాంగ్ తుపాను కారణంగా వర్షాలతో పడిన చెరువు కాల్వ గండ్లను పూడ్చివేసే పనులు చేపట్టారు. గురువారం మండలంలోని ఊట్లపల్లి వద్దగల వెంకమ్మ చెరువు కుడి కాల్వకు మూడు చోట్ల పెద్ద స్థాయిలో గండ్లు పడి మట్టి కొట్టుకుపోగా, ఎట్టకేలకు గండ్లు దగ్గర ట్రాక్టర్లతో మట్టి పోసి పూడ్చి వేశారు. ఈ గండ్లు కారణంగా రైతులు సాగు చేసిన వరి, చెరుకు పంట పొలాల్లోనే ఉండిపోగా, తాజాగా గండ్లు పూడ్చి వేయడంతో ఆయా పంటలను రైతులు పొలాల్లో నుంచి బయటకు తీసుకొచ్చే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ పనులను సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ పర్యవేక్షించారు.

శిశుమరణాల రేటు తగ్గించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చర్ల రూరల్: శిశు మరణాల రేటు తగ్గించాలని కొయ్యూరు పి.హెచ్.సి వైద్యాధికారి శ్రీధర్ అన్నారు. కొయ్యూరు పీహెచ్‌సీ పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు గురువారం శిశు మరణాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబర్ 18 నుండి ఫిబ్రవరి 23 వరకు సాన్స్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నిమ్ముతో శిశు మరణాల రేటు ఎక్కువగా ఉందని, అది తగ్గించేందుకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు.

టీబీజీకేఎస్‌ను గెలిపించండి

ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను గెలిపించాలని యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్ రావు కార్మికులను కోరారు. గురువారం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి కార్మికుల సంక్షేమానికి యూనియన్ ఎంతో కృషి చేసిందన్నారు. ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, కాపా శివాజీ, ఎస్‌వీఎస్ఎన్ వర్మ, సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు కార్మికుల విజయం

మణుగూరు రూరల్ : సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికలను నిర్వహించుకోవచ్చని హైకోర్టు ఇచ్చిన తీర్పును కార్మికుల విజయమని ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వై.రాంగోపాల్ అన్నారు. గురువారం మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టీబీజీకేఎస్ కేవలం పైరవీలకే పరిమితమై సంస్థను, కార్మికులను రక్షించుకోవాల్సింది పోయి తీవ్ర నష్టాన్ని చేకూర్చారన్నారు. కార్మికుల హక్కుల రక్షణ, సంస్థ పరిరక్షణకు పోరాడే ఏఐటియుసిని గెలిపించాలని ఆయన కార్మికులను కోరారు. ఈ సమావేశంలో మేకల ఈశ్వర్, అంథోని రవి, శ్రీనివాస్, జ్యోతుల సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా..

ములకలపల్లి : కష్టకాలంలో కాంగ్రెస్ జెండా మోసిన ప్రతీకార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కోరంపల్లి చెన్నారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ఓటమికి పనిచేసిన పలువురు పార్టీ వైపు చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా ఉంటూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు ఓటమికి పనిచేసిన కొందరు వ్యక్తులు. ఇటీవల ఎమ్మెల్యేకు దగ్గరయ్యేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, ఈఓ

అశ్వారావుపేటరూరల్: హరితహారం పథకం కోసం మొక్కల్ని పెంచే నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని అశ్వారావుపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ అట్టం రమ్య, ఈఓ హరికృష్ణ అన్నారు. గురువారం స్థానిక మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీను వారు సందర్శించి, మొక్కల పెంపకానికి బ్యాగుల్లో మట్టి నింపే పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఏపీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న నాయకులు, వృద్ధులు

భద్రాచలంటౌన్: ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను భద్రాచలం పట్టణంలో వైఎస్సార్‌టీపీ నాయకులు కొల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనవరం రోడ్డులోని మానవసేవ వృద్ధాశ్రమంలో కేక్‌కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, ఆశ్రమ నిర్వాహకురాలు సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండలో..

చంద్రుగొండ : ఏపీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను వైఎస్ కుటుంబ వీరాభిమాని నాలి సాంబ ఆధ్వర్యంలో చంద్రుగొండలో ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రధాన సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కట్ చేసి పంపిణీ చేశాడు.

వాటర్ బాటిళ్ల వితరణ



బాటిళ్లు అందజేస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

భద్రాచలంఅర్బన్: జిల్లా ఆర్య వైశ్యమహాసభ తరపున భద్రాద్రిలో నేడు, రేపు నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు వచ్చే యాత్రికుల సౌకర్యార్థం 1,500 వాటర్ బాటిళ్లను గురువారం వితరణగా భద్రాచలం పోలీసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బండారు కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గుడుమాసు వెంకట సత్యనారాయణ, నియోజకవర్గం వైస్ ఇన్‌చార్జ్ సముద్రాల అనిల్, ఉపాధ్యక్షుడు ఉప్పుటూరి రాధాకృష్ణ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లు పెంచాలని వినతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఆధార్ సెంటర్లు పెంచాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పట్టణంలో రెండు ఆధార్ అప్‌డేట్ సెంటర్లు మాత్రమే ఉన్నాయని, అనేక కారణాలతో ఈ రెండు సెంటర్లు పని చేయకపోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చల్లగుళ్ల నాగేశ్వరరావు, ప్రసాద్, కృష్ణమూర్తి, మంగయ్య, సత్యనారాయణ, సుబ్బయ్య, మురళీకృష్ణ, శివప్రసాద్ పాల్గొన్నారు.

కృష్ణా.. ముకుందా.. మురారి

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం రామయ్య శ్రీ కృష్ణావతారంలో భక్తులకు దర్శనిమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, అమరవాది కిషోర్‌కుమారాచార్యులు, నరసింహచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఈ మేరకు భక్తులకు కృష్ణావతార మహత్యాన్ని అర్చకులు విశదీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, ఆలయ సూపరిండెంట్ కిషోర్, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది రాము, శివ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణావతారంలో పర్ణశాల రామయ్య

తెప్పోత్సవానికి సర్వం సిద్ధం



తెప్పోత్సవానికి సిద్ధమైన హంసవాహనం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమానికి ఆలయ అధికారులు, మండల అధికారులు సర్వంసిద్ధం చేశారు. పవిత్రగోదావరి నదీ తీరంలో హంసవాహనంపై శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ స్వాములను విహరింపచేయడానికి అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. శుక్రవారం సాయంత్రం 6గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా గోదావరి తీరానికి స్వామివారిని తీసుకొచ్చి తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ మేరకు గురువారం సాయంత్రం దేవస్థానం, మండల అధికారులు హంస వాహనాన్ని ట్రయల్‌రన్‌ను నిర్వహించగా విజయవంతం అయ్యిందని తెలిపారు. భక్తులకు విక్రయించేందుకు లడ్డూ, పులిహోర ప్రసాదాలను సిద్ధం చేశామని, భద్రాచలం దేవస్థానం నుండి 2 వేల లడ్డూలను ఆలయానికి తీసుకునివచ్చినటు ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. భక్తులు గోదావరిలో దిగకుండా ఉండేందుకు గాను ముందస్తుగా ఇనుప కంచెను ఏర్పాటు చేసి 20 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. సీఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో ఎస్సైలు కేశవరావు, గణేష్ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

గణిత దినోత్సవం



ఎగ్జిబిట్ ప్రత్యేకతలు వివరిస్తున్న విద్యార్థిని

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గురువారం గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు రామానుజన్ గణితంలో సాధించిన విజయాలు, గణిత శాస్త్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి వరప్రసాద్, రమేష్‌బాబు, శారద, సాయి సూర్య ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు ఏరియా ఉత్తమ అధికారులు వీరే..

మణుగూరు రూరల్: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు ఏరియాలో ఉత్తమ అధికారులు, ఉద్యోగులను ఎంపిక చేశారు. ఏరియా ఉత్తమ అధికారులుగా దొడ్డల సుధాకర్ బాబు, కోట రాజిరెడ్డి, వెన్నం నవీన్, ఉత్తమ ఉద్యోగులుగా కాల్వల కుమారస్వామి, గజ్జల నారాయణ, బుద్ధరాజు రమాదేవి, ఉత్తమ సేవా సభ్యులుగా షకీరా బేగం, జమీల, శోభ ఎంపికయ్యారు. ఆయా ఉద్యోగులకు సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు ఏరియా అధికారి ప్రతినిధి ఎస్.రమేష్ తెలిపారు.

ఓటరుగా నమోదు చేయించాలి



మాట్లాడుతున్న అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని 40 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లకు, నలుగురు సూపర్‌వైజర్లకు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్, వ్యవసాయాధికారి నవీన్ మాట్లాడుతూ... జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడు ఓటరుగా నమోదు చేయించాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా సవరణ చేయాలన్నారు. అలాగే మృతిచెందిన వారిని ఓటర్ల జాబితా నుండి వెంటనే తొలగించాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రహదారులే కల్లాలు..!



కేశప్పగూడెం-మొద్దులగూడెం సింగిల్ రోడ్డులో ఆరబోసిన ధాన్యం



ఊట్లపల్లి వద్ద మలుపులో ప్రమాదకరంగా ఉన్న ధాన్యం కుప్పలు

అశ్వారావుపేటరూరల్: ప్రధాన రహదారులే అన్నదాతలకు కల్లాలుగా మారాయి. రోడ్లపైనే ధాన్యం కుప్పలు ఆరబెట్టడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని కేశప్పగూడెం నుంచి మొద్దులగూడెం వెళ్లే మార్గం, ఊట్లపల్లి వద్ద భద్రాచలం వెళ్లే ప్రధాన రహదార్లపై కొంతమంది రైతులు ధాన్యం రాశులను ఆరబెట్టారు. ఊట్లపల్లి వద్ద రహదారికి ఒక వైపు పూర్తిగా ధాన్యం కుప్పలే ఉండటంతో ఒక వైపు ఉన్న రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మలుపుల మద్దే ధాన్యం కుప్పలు ఆరబెట్టడంతో మరింత ప్రమాదకరంగా మారాయి. రోడ్లంతా ధాన్యం ఆరబోయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి కల్లాలు నిర్మించాలని రైతులు కోరుతుండగా, రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ధాన్యపు రాశులను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.